కుక్కల దాడిలో జింక మృతి

ప్రజాశక్తి- కవిటి

కవిటి మండలం గొండ్యాలపుట్టుగలో శుక్రవారం రాత్రి కుక్కల దాడిలో జింక మృతి చెందింది. శనివారం ఉదయం జింకను చూసిన స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అటవీ సిబ్బంది మృతి చెందిన జింకను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఖననం చేశారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది రాఘవయ్య, రవి, పసు వైద్య సిబ్బంది పురుషోత్తం పాల్గొన్నారు.

పోస్టుమార్టం నిర్వహిస్తున్న సిబ్బంది

- మృతి చెందిన ఉద్యోగిపై నెపం నెట్టేస్తున్న పాలకవర్గం
- పాలక పెద్దపై రైతుల అనుమానం
- అధికారుల మౌనంపై అనేక సందేహాలు

బూర్జ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం

అవకతవకల వెనకున్నదెవరు?

బూర్జ పిఎసిఎస్‌లో జరిగిన నిధుల అవకతవకలపై రైతుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. తాము తీసుకున్న లోన్ డబ్బులు, వడ్డీ సొమ్ము జమ సొసైటీలో జమకాకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు నేరుగా సొసైటీకి వెళ్లి డబ్బులు కట్టడమో లేక గతంలో సిఇఒగా పని చేసిన శాస్త్రి చేతికి ఇచ్చేయడమో చేశారు. కొద్ది రోజుల తర్వాత రసీదులు అడిగితే ఎక్కడి వెళ్లిపోతాం, రసీదులు ఇస్తామంటూ సిఇఒ బదులివ్వడంతో రసీదులకేముందంటూ పెద్దగా పట్టించుకునేవారు కాదు. ప్రస్తుతం ఆ సొమ్ము ఏమైందో తెలియని పరిస్థితి నెలకొంది. లక్షలాది రూపాయాల సొమ్ము ఎవరు స్వాహా చేశారన్న చర్చ బూర్జ మండలంలో జోరుగా సాగుతోంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

బూర్జ పిఎసిఎస్ పరిధిలో ఇప్పటివరకు రూ.13 కోట్లు బకాయిలు ఉండగా, రూ.9 కోట్ల వరకు వసూలైంది. ఇందులో రైతులు తాము తీసుకున్న అప్పు, దానికి సంబంధించిన వడ్డీ సొమ్ము చెల్లించినా ఇంకా రుణంగానే చూపుతున్న సొమ్ము ఎంత ఉందనేది గ్రామాల్లోకి వెళ్లి పరిశీలిస్తేగాని తెలిసే పరిస్థితి లేదు. వడ్డీ, లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లింపుల కోసం సిఇఒ పైడిమర్రి శాస్త్రి ఇళ్లకు వచ్చి వసూలు చేసేవారని రైతులు చెప్తున్నారు. అంతా ఆయకే ఇచ్చేవారమని అన్ని గ్రామాల్లోనూ అదే మాట వినిపిస్తోంది. ఈ ఏడాది జూలైలో శాస్త్రి మృతి చెందడంతో బకాయిల బాగోతం బయట పడింది. దీంతో తమ సొమ్మంతా శాస్త్రి తినేశారని రైతులు అనుకుంటున్నారు. డిసిసిబి అధికారులు మాత్రం ఇందులో నిజం లేదని, శాస్త్రి అనారోగ్యంతో ఆస్పత్రి పాలైన సందర్భంలో కొంత మంది చందాలు వేసుకుని వైద్య ఖర్చులు భరించారని అధికారులు అంటున్నారు. రైతుల నుంచి వసూలు చేసిన సొమ్మును దాచే పరిస్థితి ఉంటే వైద్య ఖర్చుల కోసం అందరిని అడగాల్సిన దుస్థితి ఎందుకొస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు.

వెనుకుండి కథ నడిపింది సొసైటీ పెద్ద మనిషేనా?

సిఇఒ శాస్త్రి అంత పెద్ద మొత్తాన్ని వెనకేసుకున్నారంటే ఎవరికీ నమ్మశక్యం కావడం లేదు. సొసైటీ పెద్దలెవరో స్వాహా చేసి ఉంటారని అంతా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన చనిపోవడంతో సొసైటీ పాలవర్గం, ఉద్యోగులు అందరూ కలిసి అవకతవకలను ఆయనపైకి నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అల్లెన గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బాలచంద్ర మౌళీశ్వరరావు రూ.2 లక్షల రుణం తీసుకునేందుకు ఈ ఏడాది మేలో రూ.28 వేలు షేర్ క్యాపిటల్‌గా కట్టారు. సిబ్బంది ఎవరికైనా ఇస్తే జమ అవుతుందో? లేదోనని స్వయంగా తానే చైర్మన్ బగాది నారయణమూర్తికి అందించినట్లు ఆయన చెప్తున్నారు. ఇదిగో అదిగో లోన్ అంటూ కొద్ది రోజులు నాన్చి డబ్బులు ఏమయ్యాయో తెలియదు, తర్వాత వసూలు చేసి ఇస్తామని చైర్మన్ చెప్పడంతో షేర్ క్యాపిటల్ కింద మరోసారి రూ.28 వేలు ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన గొర్లె కృష్ణమూర్తి నాయుడి అదే షేర్ క్యాపిటల్ ఇచ్చారు. వీళిద్దరూ చైర్మన్‌కు డబ్బులు ఇచ్చినా అవి మాయం కావడంపై అందరిలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులేం చేస్తున్నారు?

బూర్జ పిఎసిఎస్‌లో లక్షలాది రూపాయలు పక్కదారి పట్టినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది సంవత్సరాలుగా నిధులు అవకతవలు జరగుతున్నా అధికారులు కిమ్మనడం లేదు. రికార్డులు పరిశీలించినా, రైతులను అడిగినా విషయం తెలిసేది. అధికారులు రికార్డులు చూడలేదా? లేక చూసి అధికార పార్టీకి చెందిన నాయకుడు కావడంతో చర్యలు తీసుకోలేకపోతున్నారా? అనే చర్చ రైతుల్లో సాగుతోంది. ఇప్పటికైనా డిసిసిబి అధికారులు రంగంలోకి దిగితే సొసైటీలో జరగుతున్న అక్రమాలు మరిన్ని వెలుగు చూసే అవకాశముందన్న అభిప్రాయం అంతటా వ్యక్తమవుతోంది.

అదిరింపులు... బెదిరింపులు

సొసైటీలో చోటు చేసుకున్న అవకతవకలపై ప్రజాశక్తి టాబ్లయిడ్‌లో గత రెండు రోజులుగా వస్తున్న వరుస కథనాలతో సొసైటీలో చక్రం తిప్పుతున్న అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు, సిబ్బంది ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సమాచారం ఎవరిస్తున్నారంటూ ఉద్యోగిపై కీలక నాయకుడు మండిపడుతున్నట్లు తెలిసింది. నిధుల అవకతవకలపై సమాచారం ఇస్తున్న రైతులకు ఫోన్ చేసి మీకు రేపో మాపో రుణం ఇద్దామనుకున్నామని, పత్రికలెక్కడంతో మీకు అప్పు ఇవ్వమని బెదిరిస్తున్నట్లు సమాచారం.

ఖాదీ, చేనేతలో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

ఇన్వెస్టు ఇండియా టీం కమిటీ ప్రతినిధి ఆరాధన

ప్రజాశక్తి- పొందూరు, శ్రీకాకుళం అర్బన్

ఖాదీ, చేనేత రంగాల్లో నూతన ఆవిష్కరణలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఇన్వెస్టు ఇండియా టీం కమిటీ ప్రతినిధి ఆరాధన అన్నారు. చేనేత జౌళిశాఖ 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' కార్యక్రమంలో భాగంగా పొందూరు పట్టణంలోని ఏఎఫ్‌కేకే సంఘం, సాయిబాబా చేనేత సొసైటీల చీరలు, బట్టలు తయారీని శనివారం కేంద్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా పొందూరులో ఖాదీ, చేనేతల్లో తయారు చేస్తున్న చీరలు, బట్టలు నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాదీలో వస్త్రం తయారీకి అనుసరిస్తున్న వివిధ ప్రకియలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం, అవార్డుకు దేశవ్యాప్తంగా 506 ఉత్పత్తులు పోటీ పడగా, అందులో 60 ఉత్పత్తులు పరిశీలనలో ఉండగా, వాటిలో రాష్ట్రానికి సంబంధించిన 14 ఉత్పత్తులు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల సమస్యలపై ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. దీనిపై పలువురు చేనేత కార్మికులు మాట్లాడుతూ చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన ఖాదీ వస్త్రాల తయారీపై యువత దూరం అవుతుండడంతో రానురానూ అంతరించిపోతుందని అన్నారు. యువతకు ఆకర్షించేలా వస్త్రాల తయారీ కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఖాదీ వస్త్రాల తయారీలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మజూరీ పెంచడం వంటి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. అలాగే ముడిసరుకు సమస్యను పరిష్కరించడంతో పాటు కొత్త పరికరాలను అందించాలన్నారు. 50 ఏళ్లు నిండిన వడుకు కార్మికులకు పింఛన్‌ను అందించాలని కోరారు. ఈ సందర్భంగా పొందూరు ఖాదీ ప్రాముఖ్యతను ఏఎఫ్‌కేకే సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వరప్రసాద్, దండా వెంకటరమణలు కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ఒక జిల్లా ఒక ఉత్పత్తి కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పర్యటనలో జెసి ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర, చేనేత జౌళిశాఖ జెడి కన్నబాబు, జోనల్ ఆఫీషర్ బి.ధనుంజయరావు, జిల్లా ఎడి ఐ.ధర్మారావు, తహశీల్దార్ వై.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

పొందూరు : ఖాదీ వస్త్రాలను పరిశీలిస్తున్న ఇన్వెస్టు టీం కమిటీ ప్రతినిధి ఆరాధన

జిల్లా చేనేత ఉత్పత్తులు అంతర్జాతీయ ఖ్యాతి

ఒక జిల్లా-ఒక ఉత్పత్తి అవార్డు (ఒడిఒపి)కి జాతీయ స్థాయిలో ఎంపిక కావడానికి జిల్లా ప్రాథమిక దశలో గుర్తించడం జరిగిందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. జాతీయ అవార్డు నామినేషన్ పరిశీలనలో భాగంగా ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం సభ్యులు ఆరాధన శర్మతో కలెక్టరేట్‌లోని సమావేశం నిర్వహించారు. ముందుగా కేంద్ర బృందం సభ్యులకు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అంతర్జాతీయ గుర్తింపు ఉన్న జిల్లా చేనేత ఉత్పత్తులు, ఎగుమతులపై వివరించారు. అనంతరం పొందూరు ఖాదీ ఉత్పత్తులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. ప్రభుత్వాలు అందిస్తున్న పింఛను, వైఎస్ఆర్ నేతన్న నేస్తం, ముడి సరుకులు, ముద్ర పథకాలు, రాయితీలు వివరించారు. పొందూరు ఖాదీ ఉత్పత్తులపై శంకరరావు వివరించారు. సమావేశంలో జెసి ఎ.నవీన్, చేనేత, జౌళిశాఖ జాయింట్ డైరెక్టర్ కన్నబాబు, సహాయ సంచాలకులు ధర్మారావు, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ ఉమా మహేశ్వరరావు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేఖర్, శ్రీను, ఎడిఒ రమేష్, రమణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

అర్హతే ప్రామాణికం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రొట్టవలస పంచాయతీ పరిధిలోని అవతారబాద్, రొట్టవలస గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గడపగడపకు వెళ్లి వైసిపి ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారని అన్నారు. నిరుపేదల గౌరవాన్ని పెంచేలా జగన్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఆలోచన, ఆశయానికి ప్రతిరూపంగా ఉన్న గడపగడపకు మన ప్రభుత్వ లక్ష్యం ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు బద్రి రామారావు, వైస్ ఎంపిపి లావేటి అనిల్ కుమార్, బిసి సెల్ జిల్లా డైరెక్టర్ మూడడ్ల రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ సెమినార్ వాయిదా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలో ఈనెల 15,16న జరపతలపెట్టిన జాతీయ సెమినార్ వాయిదా వేసినట్టు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వర రావు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.నాగమణి తెలిపారు. ఈమేరకు సిఐటియు జిల్లా కార్యాలయంలో వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. సిఐటియు జాతీయ నాయకులు పర్సా సత్యన్నారాయణ శతజయంత్యుత్సవాల్లో భాగంగా ఈ సెమినార్ నిర్వహించాల్సి ఉందన్నారు. ముఖ్య వక్తలు సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వి.నాగేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోతున్నందున ఈ సెమినార్ వాయిదా వేశామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని తిరిగి నిర్వహించే తేదీలను వెల్లడిస్తామన్నారు. పాలకులు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, సమస్యలు పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు సిఐటియు అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ప్రజాధనంతో నిర్మించిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, రైల్వే, బిఎస్ఎన్ఎల్, బ్యాంకులు, ఇన్స్యూరెన్స్, పోస్టల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 4 లేబర్ కోడ్స్ మార్చి కార్మికులను ఆధునిక బానిసలుగా మారుస్తున్నాయని అన్నారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు అనేక ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలిపారు. వివిధ రంగాల కార్మికులు, మున్సిపల్, పంచాయతీ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, విఒఎ తదితర స్కీం వర్కర్లు, విఆర్ఎ, భవన నిర్మాణ, హమాలీ తదితర కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని పోరాటం చేస్తున్నారని అన్నారు.

మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ప్రత్యేక బస్సులకూ సాధారణ టిక్కెట్లే

శ్రీకాకుళం అర్బన్ : దసరా పర్వదినాలను పురస్కరించుకుని శ్రీకాకుళం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపుతున్నామని, ఈ సర్వీసులకూ సాధారణ ఛార్జీలేనని రెండో డిపో మేనేజర్ శర్మ అన్నారు. తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం 1, 2వ డిపోల నుంచి ఈ నెల 20 నుంచి 27 వరకు అదనపు బస్సు సర్వీసులను నడుపుతున్నట్టు తెలిపారు. 20, 21న హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఉన్నాయన్నారు. అలాగే దసరా మహోత్సవాలకు నడుపుతున్న ప్రత్యేక బస్సుల్లో పలు రాయితీలను ప్రకటించామని చెప్పారు. ప్రయాణికులు రాను, పోను టిక్కెట్ ఒకేసారి తీసుకుంటే ఛార్జీల్లో 10 శాతం రాయితీ పొందవచ్చన్నారు. ఎపిఎస్ఆర్‌టిసి ఈ-వాలెట్ ద్వారా బుక్ చేసుకునే వారికి 5 శాతం, నలుగురు సభ్యులు (పిల్లలతో సహా) ఒకేసారి బుక్ చేసుకుంటే 5 శాతం, వయోవృద్ధులకు అన్ని రకాల సర్వీసుల్లో 20 శాతం, డిజిటల్ ఆధార్ కార్డును ఐడీ ప్రూఫ్‌గా చూపించి ఈ రాయితీలు పొందవచ్చన్నారు. టిక్కెట్లు ఆన్‌లైన్ ద్వారా కానీ, సమీపంలోని బస్ స్టేషన్‌లో కానీ, ఆర్‌టిసి అధీకృత టిక్కెట్ బుకింగ్ ఏజెంట్ల వద్ద గాని పొందవచ్చన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సురక్షితమైన ప్రయాణాన్ని పొందాలన్నారు. ఆదివారం నుంచి శ్రీకాకుళం-పాలకొండ మార్గంలో రెండు వైపుల నుంచీ రెండు పల్లె వెలుగు బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ బస్సులు ఉదయం 6, 7.30, 9, 10.30 గంటలకు, మధ్యాహ్నం 12, 1.45, 3.15, సాయంత్రం 4.45, 6.15 రాత్రి 8 గంటలకు సర్వీసులు నడుపుతున్నట్టు చెప్పారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విదేశీ కొబ్బరి దిగుమతులతో నష్టం

శ్రీకాకుళం అర్బన్ : విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులతో కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎపి కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని నాఫెడ్ కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని డిమాండ్ చేశారు. నగరంలోని సుందరయ్య భవనంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రి ఉత్పత్తుల దిగుమతులకు అవకాశం కల్పించడం వల్ల కొబ్బరి రైతులకు కనీసం ధరలు రావడం లేదన్నారు. కొన్నేళ్లుగా ఎర్రనల్లి, తెల్లదోమ వంటి తెగుళ్ల వల్ల దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారని అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఒక్కో కొబ్బరికాయకు రైతుకు రూ.6 నుంచి రూ.7లు మాత్రమే ధర వస్తోందన్నారు. చెట్టు నుంచి కొబ్బరికాయలు కోసి గుట్టగా పోయడానికి ఒక్కో కాయకు రైతుకు రూ.3లకు పైగా ఖర్చు అవుతుందన్నారు. రైతు చేతికి కాయకు రూ.3 మించి రావడం లేదన్నారు. కొబ్బరి కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మిల్లింగ్ కోప్రాకు క్వింటాకు రూ.10,860, బంతి కోప్రాకు క్వింటాకు రూ.11,750 ఏమాత్రం రైతుకు గిట్టుబాటు కాదన్నారు. ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కొబ్బరి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వాలు కొబ్బరి రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రైతుల నుంచి కొబ్బరికాయలను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని వెయ్యి కొబ్బరి కాయలకు కనీస ధర రూ.15 వేలు ఇవ్వాలన్నారు. కేరళ తరహాలో సహకార రంగంలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా కొబ్బరి రైతులకు సబ్సిడీ పథకాలు అందించాలన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, బి.వాసు, చంద్రరావు, కొండయ్య, పి.భాస్కరరావు, రైతులు, రైతు సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాస్

అవస్థలు పడుతున్న వాహనదారులు

పోర్టు వాహనాలతో బెంబేలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పోర్టు వాహనాల అతివేగంగా రాకపోకల వల్ల టెక్కలి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సంతబొమ్మాళి మండలం మూలపేటలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ పోర్టు కోసం టెక్కలి మీదుగా రాయి తరలిస్తున్నారు. ఈ వాహనాలు ఒకే సారి పదుల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. భారీలోడ్లతో తిరగడం వల్ల రావివలస టెక్కలి -నౌపాడ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రహదారి పూర్తిగా గోతులైపోవడంతో నడవడానికీ ఇబ్బందిగా మారింది. పోర్టు వాహనాలు నడిపే డ్రైవర్లు నిత్యం జన రద్దీగా ఉండే రోడ్డుపై వాహనాలను వేగంగా నడుపుతూ ఎదురెదురుగా వస్తున్న వాహనదారులు, గ్రామస్తులను భీతిల్లే పరిస్థితి కల్పిస్తున్నారు. దీంతో ప్రమాదం ఏవైపు నుంచి వస్తుందో అని జనాలు బెంబేలెత్తి తున్నారు. అధ్వానంగా ఉన్న రహదారులపై మితిమీరిన వేగంతో భారీ వాహనాల రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం -సాయంత్రం వేళలో బస్టాండ్ వద్ద జన సంచారం ఎక్కువగానే ఉంటుంది. ఆ సమయంలోనూ వాహనాలు మితిమీరిన వేగంతో తిరగడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది పలువురు చర్చించుకుంటున్నారు. ఇందిరాగాంధీ విగ్రహం నుంచి గోపీనాథపురం వరకూ ఈ రోడ్డుపై విద్యార్థులు సైకిళ్లపై కళాశాలలకు వెళ్తుంటారు భారీ వాహనాలు తిరగడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పోర్టు వాహనాలతో ఎప్పుడు తమ పిల్లలకు ఏ ప్రమాదం ముంచుకొస్తుందని భయాందోళనకు గురవుతున్నారు. టెక్కలి పోలీసులు సైతం వాహనాలు అదుపు చేయడంలో విఫలమవుతున్నట్లు పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎవరి తపన వారిదే

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎన్నికలకు మరో ఆరేడు నెలలు ఉండటంతో పార్టీకి, ప్రభుత్వానికి మంచి ప్రచారం దక్కేలా ప్రభుత్వం ఇటీవల అనేక కార్యక్రమాలను తీసుకుంది. అందులో ముఖ్యమైన కార్యక్రమాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష ఒకటి. కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించి మంచి ప్రచారం పొందాలని భావించిన ప్రభుత్వానికి ఆశించినంతగా పేరు దక్కడం లేదు. వైద్య శిబిరానికి నిపుణులైన డాక్టర్లు వస్తారంటూ స్థానిక నాయకులు ప్రచారం చేస్తున్నా... జనం నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు. సచివాలయ సిబ్బంది, టవలంటీర్లు, నాయకులతోనే శిబిరం నిండిపోతోంది. కొన్నిచోట్ల మనుషులు రాకపోతే వారు వచ్చినట్లు వేలి ముద్రలు వేయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమం నుంచి ఆశించిన ఫలితం రాకపోగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సామూహిక గృహప్రవేశ ఉత్సవాలూ పేలవంగా జరిగాయి. పార్టీకి, కేడర్‌కు సమన్వయం కొంత లోపించినట్లుగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒకలా ఆలోచిస్తే... వైసిపి కేడర్ మరోలా ఆలోచిస్తోంది. వచ్చే ఏడాది ఎన్నికలు రానున్న నేపథ్యంలో పెండింగ్ ప్రాజెక్టులు, పథకాలను పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తొందరపడుతుంటే... జిల్లా నాయకత్వం మాత్రం దీనిని పెద్దగా సీరియస్ తీసుకున్నట్లు కనిపించడం లేదు. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సామూహిక గృహప్రవేశాలే ఇందుకు ఉదాహరణ. కార్యక్రమాన్ని చాలా అట్టాహాసంగా చేసి రాజకీయంగా వచ్చే ప్రయోజానాన్ని తన ఖాతాలో వేసుకోవాలని పార్టీ పరితపించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి నిర్వహించిన సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో భాగంగా జిల్లాకు సంబంధించి జలుమూరు మండలం లింగాలవలసలో లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లా సామర్లకోటలో వీటిని ప్రారంభిస్తే.. జిల్లాల్లో నిర్ణయించిన లేఅవుట్లలో జిల్లా మంత్రులు ప్రారంభించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. లింగాలవలస లేఅవుట్‌లో సామూహిక గృహప్రవేశాలకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వస్తారని అంతా భావించారు. జిల్లాలోనే ఉన్నా ఆయన రాకపోవడం ఒక రకమైన రాజకీయ చర్చకు దారి తీసింది. శ్రీకాకుళంలో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు సామూహిక గృహ ప్రవేశాలకు రాకుండా డుమ్మా కొట్టడం అనేక సందేహాలకు తావిచ్చింది. మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే కృష్ణదాస్ నియోజకవర్గంలో కార్యక్రమం నిర్వహిస్తుండటంతో అక్కడికి వెళ్లడానికి ఇష్టం లేకే హాజరు కాలేదా? అన్న చర్చ కేడర్‌లో సాగుతోంది. వీరిద్దరి మధ్య అంతర్గత విభేదాలు ఉన్నాయా? అన్నట్లు ఇరువురూ వ్యవహరిస్తుండటం చర్చకు మరింత బలం చేకూరుతోంది. గతంలో పలుమార్లు జిల్లాస్థాయి పార్టీ సమావేశాల్లో పక్కపక్కనే కూర్చున్నా కనీసం పలకరించుకోకపోవడాన్ని ఉదాహరిస్తున్నారు. కారణాలేవైనా మంత్రి ధర్మాన గైర్హాజరు కాకపోవడం, ఇతర ప్రజాప్రతినిధులూ రాకపోవడంతో సామూహిక గృహ ప్రవేశాలు అత్యంత పేలవంగా సాగాయన్న విమర్శలు వచ్చాయి. నేతల మధ్య విభేదాలు, సమన్వయం లోపంతో జిల్లాలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం విఫలమైందనే చెప్పొచ్చు. దీంతో ప్రభుత్వం ఆశించినట్లుగా ప్రభుత్వానికి, పార్టీకి దక్కాల్సిన ఇమేజ్ రాకుండా పోయింది.

వైసిపికి రావాల్సినంత మైలేజ్ రాకపోవడం వెనుక చంద్రబాబు అరెస్టు ప్రభావమూ కొంత ఉండొచ్చన చర్చ జిల్లాలో సాగుతోంది. చంద్రబాబు అరెస్టు నాటి నుంచి నేటి వరకు ఏదో ఒక నిరసన కార్యక్రమం చేస్తూ రోడ్డెక్కడంతో అవే ఫోకస్ అవుతున్నాయి. చంద్రబాబు అరెస్టు వార్తలు, ఆరోగ్యం వంటి అంశాల చుట్టే జనాల చర్చ కూడా సాగుతోంది. చంద్రబాబు అరెస్టు శ్రేణులకు బాధ కలిగిస్తున్నా, గతనెల రోజులకు పైగా ఏదో ఒక నిరసన కార్యక్రమంతో యాక్టివ్ అవ్వడం తమకు మేలు చేసేదిగా పార్టీ నాయకులు భావిస్తున్నారు. అధినేత జిల్లా పర్యటనకు వచ్చినప్పుడో, లేక ఏదైనా అంశంపై పార్టీ పిలుపు నిచ్చిన సందర్భంలో మాత్రమే అక్కడక్కడ రోడ్డు మీదకు వచ్చే పార్టీ శ్రేణులు ఇప్పుడు నిరంతరం ఆందోళన కార్యక్రమాల్లో తలమునకలై ఉన్నారు. ఇప్పుడు తాజాగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంచే కార్యక్రమాన్ని చేస్తున్నారు. చంద్రబాబుపై ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని, అక్రమంగా అరెస్టు చేసి జైలు పాలు చేసిందంటూ కరపత్రాల ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. కరపత్రాల ద్వారా ఇలా జనం దగ్గరకు వెళ్లడం టిడిపికి బహుశా ఇదే మొదటి సారి కావొచ్చు. గతంలో పలు సందర్భాల్లోనూ, ప్రస్తుతం ప్రతిపక్షంగా ఉన్నా ప్రజా సమస్యలను కరపత్రాల రూపంలో ముద్రించి ఇంటింటికీ వెళ్లడం ఎప్పుడూ చేయలేదు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ, విశాఖకు రైల్వేజోన్, వెనుకబడిన జిల్లాగా ఉన్న శ్రీకాకుళానికి నిధులు ఇవ్వకుండా ఆపేసిన కేంద్రం అన్యాయంపై ఏనాడూ పోస్టర్లు పంపిణీ చేసిన సందర్భాలు లేవు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు, ప్రభుత్వ విధానాలతో ఇబ్బంది పడుతున్న వివిధ తరగతుల ప్రజల సమస్యలను జనంలోకి తీసుకువెళ్లిందీ లేదు. అధినేత అరెస్టుపై స్పందించినట్లుగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై మాట్లాడితే ప్రజల నుంచి వారికి తప్పనిసరిగా మద్ధతు లభిస్తుందన్న విషయం గుర్తించాలి.

పత్రికా ప్రకటన

పాస్ పోర్ట్ పోయింది. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం పాత కొజ్జిరియా గ్రామానికి చెందిన పనపాన రాజు S/o పనపాన కృష్ణారెడ్డి చెందిన పాస్ పోర్ట్ నెంబర్U1851949 కొత్త కొజ్జిరియ నివాసం నుంచి పాత కొజ్జిరియా నివాసానికి మారుతుండగా మార్గ మధ్యలో పడిపోయింది. ఎవరికైనా దొరికిన ఎడల పనపాన రాజు కు గానీ కవిటి పోలీస్ స్టేషన్‌లో కానీ అప్పగించాలని విజ్ఞప్తి.

9618820060

పత్రికా ప్రకటన

పాస్ పోర్ట్ పోయింది. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం పాత కొజ్జిరియా గ్రామానికి చెందిన ఉప్పాడ గణేష్ S/o ఉప్పాడ లింగరాజు చెందిన పాస్ పోర్ట్ నెంబర్ S8825094 పాత కొజ్జిరియ నుంచి రాజపురం బైక్ పై వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయింది. ఎవరికైనా దొరికిన ఎడల ఉప్పాడ గణేష్ కు గానీ కవిటి పోలీస్ స్టేషన్‌లో కానీ అప్పగించాలని విజ్ఞప్తి.

9553209372

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి
మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్‌పి జి.ఆర్‌ రాధిక ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌ రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. భవనం మరమ్మతులు గుర్తించడంతో రికార్డులు తడిసిపోకుండా భద్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అలాగే సరిహద్దుల్లో అక్రమ రవాణాలపై మరింత దృష్టి సారించాలన్నారు. నాటు సారా తయారీ, రవాణాలపై దృష్టి సారించాలన్నారు. పెండింగ్‌ కేసులపై దృష్టి సారించాలని, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం సిఐ వినోద్‌బాబు, ఎస్‌ఐ టి.రాజేష్‌, ఎస్‌ఐలు నర్సింగరావు, అప్పన్న సిబ్బంది ఉన్నారు.

మైదానాన్ని పరిశీలిస్తున్న రవిశంకర్‌ చలం

క్రికెట్‌ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి
క్రికెట్‌ క్రీడారంగంలో నైపుణ్యాలను, మెలకువలను శిక్షణలో పెంపొందించుకోవాలని మాజీ రంజీ ఆటగాడు, జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ మెంబర్‌ రవిశంకర్‌ చలం అన్నారు. జిల్లా లోని క్రికెట్‌ సబ్‌ సెంటర్ల పరిధిలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మినీ స్టేడియం వద్ద ఉన్న క్రికెట్‌ నెట్స్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయా విభాగాల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న వర్ధమాన క్రికెట్‌ క్రీడాకారులతో మాట్లాడారు. కఠోర దీక్షతో శ్రమిస్తే ఫలితం మీ సొంతం అవుతుందని వారిలో స్ఫూర్తి నింపారు. ఉత్తమ ఆటతీరుతో రాణించి జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు మరింతగా రాణించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపడుతుందని వెల్లడించారు. క్రీడాకారులకు ప్రాక్టీస్‌ మ్యాచ్‌లు నిర్వహించడం వలన వారిలో ఇమిడివున్న ప్రతిభ వెలికి తీయడంతో పాటు పలువురికి అవగాహన పెంపొందించవచ్చునని అభిప్రాయ పడ్డారు. క్రికెట్‌ అభివృద్ధికి కృషిచేస్తున్న జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు శాస్త్రి, హసన్‌ రాజా షేక్‌, చూపిస్తున్న చొరవ శుభ సూచికమని క్రీడాకారులు, తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం క్రికెట్‌ మ్యాచ్‌ల నిర్వహణకు అనుకూలంగా ఉండే కె.కొత్తూరు సమీపంలోని ఆదిత్యా ఇంజనీరింగ్‌ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నార్త్‌ జోన్‌ సెలక్టర్‌ దీపక్‌, శిక్షకులు శ్రీనివాస్‌, మేఘనాథ్‌ పాల్గొన్నారు.

ఇష్టంగా చదవడమే విజయ రహస్యం

సివిల్స్‌ అవగాహనా సదస్సులో డాక్టర్‌ సతీష్‌

ప్రజాశక్తి- నరసన్నపేట

మాట్లాడుతున్న సతీష్‌

చరిత్రను కష్టంగా కాకుండా ఇష్టంగా చదవడం ద్వారానే విజయం సాధించగలమని చరిత్ర విషయ నిపుణుడు డాక్టర్‌ మాకేన సతీష్‌ తెలిపారు. శనివారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో 'చరిత్ర- సివిల్స్‌ సన్నద్ధత" అనే అంశంపై నిర్వహించిన అవగహన సదస్సులో అయన పాల్గొన్నారు. సదస్సుకు హాజరైన విద్యార్థులతో మాట్లాడుతూ పట్టుదలతో ముందుకు వెళ్తె విజేతలవుతారన్నారు. విజయపథం వైపు నడిపించే లక్షణాల్లో ఉత్తమమైనది ఆశయమని, అదే చోదక శక్తిగా మారి మార్గాన్ని నిర్దేశిస్తుందన్నారు. ప్రణాళికబద్ధంగా ప్రిపరేషన్‌ సాగిస్తేనే విజయం సాధ్యమేనన్నారు. ప్రామాణిక పుస్తకాలు మొదలు, ఇంటర్నెట్‌ ఆధారంగా తాజా పరిణామాలపై విశ్లేషణాత్మకంగా పట్టు సాధించాలన్నారు. డిగ్రీస్థాయి నుండి ప్రిపరేషన్‌ మొదలు పెట్టాలన్నారు. నిర్దిష్ట సమయంలో సమాధానాలు ఇచ్చే నైపుణ్యం పెంపొందించు కోవాలని దానికి నిరంతరం వివిధ రకాల దినపత్రికలు, జాతీయ స్థాయి మ్యాగజైన్‌లు చదవాలన్నారు. అవగాహన సదస్సులో విద్యార్థులు సివిల్స్‌ పరీక్షకు సంబంధించి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. గ్రామీణ ప్రాంతపు విద్యర్థులమని, తెలుగు మాధ్యమంలో చదువుకున్నామన్న అనవసరపు భయాలు అక్కర్లేదని తెలిపారు. కళాశాల డైరెక్టర్‌ సిహెచ్‌ దుర్గా ప్రసాద్‌ మాట్లాడుతూ ప్రణాళికతో చదివితే సివిల్స్‌లో విజయం సాధించటం కష్టమేమికాదన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వనరులు తమ కళాశాలలో సమకూరుస్తున్నామన్నారు. నిపుణులైన అధ్యాపకులచే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రతినిధి పాగోటి రామ చంద్రరావు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

సోంపేట: సోంపేట రోటరీక్లబ్‌ ఆధ్వర్యంలో శ్రీకాకుళం మెడికవర్‌ హాస్పిటల్‌ సౌజన్యంతో స్థానిక రోటరీక్లబ్‌ ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం మెడికవర్‌ హాస్పిటల్‌ వైద్యులు శిబిరానికి హాజరైన వారికి బిపి, సుగర్‌, ఇసిజితో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు శ్రీనివాస్‌ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకే రోటరీ క్లబ్‌ ఉందని, వైద్యులకు సూచించిన సలహాలు మేరకు మందులు అందించారు. మెడికవర్‌ వైద్య బృందంతో పాటు సోంపేట ప్రభుత్వ ఆస్పత్రి విశ్రాంత సూపరింటిండెంట్‌ డాక్టర్‌ లక్ష్మీనారాయణ, రోటరీ సెక్రెటరీ పివి కృష్ణారావు, ట్రెజరర్‌ కె.రవికుమార్‌, రోటరీ సభ్యులు, రోటరాక్ట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ కర్రి మిన్నారావు పాల్గొని సేవలందించారు.

డిఎ బకాయిలు చెల్లించాలి

ఆమదాలవలస : 60 నెలలుగా పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలను కనీసం "దసరా" కైనా ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్‌. జవహర్‌రెడ్డిని జిల్లా జెఎసి ఆర్గనైజింగ్‌ కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు కోరారు. ఉద్యోగుల ఆమోదం లేకుండానే జిపిఎస్‌ను అమలు చేయడం, కేంద్రం పెంచిన 14 శాతం ప్రభుత్వ కంట్రిబ్యూషన్‌ జమ చేయకపోవడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు న్యాయంగా రావలసిన పిఆర్‌సి బకాయిలను కూడా సత్వరమే చెల్లించి ఆదుకోవాలని కోరారు.

చంద్రబాబు ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

శ్రీకాకుళం అర్బన్‌ : సుదీర్ఘ కాలం పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పట్ల ప్రభుత్వం అనుసరి స్తున్న నిర్లక్ష్య వైఖరి తగదని, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఆయనను తక్షణమే సూపర్‌స్పెషాలటీ వైద్యం అందించాలని టిడిపి డాక్టర్‌ సెల్‌ అధ్యక్షులు డాక్టర్‌ సుధాకర్‌ పేర్కొన్నారు. శనివారం నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వయసు రీత్యా చంద్రబాబుకు అనారోగ్య సమస్యలు ఎదురుకానున్నా యని, కుటుంబ సభ్యులు ములాఖత్‌ సమయంలో పరిస్థితిని గమనిస్తున్నారని తెలిపారు.

రానున్న ఎన్నికల్లో టిడిపిదే విజయం

టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్‌

ఆమదాలవలస: కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్‌

ప్రజాశక్తి- ఆమదాలవలస
రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని టిడిపి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్‌ అన్నారు. శనివారం పురపాలక సంఘంలోని 16వ వార్డు పరిధిలోని డాబాలవారి వీధి, మార్కెట్‌ వీధి, శివన్నారాయణ క్వార్టర్స్‌, వరదావారి క్వార్టర్సుల్లో బాబుతో నేను అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు అరెస్టు, వైకాపా పాలన తీరుతెన్నుల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగున్నర ఏళ్లలో వైకాపా పాలనలో ప్రజలు పలు రకాల ఇబ్బందులకు గురయ్యారన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుతో ప్రజల్లో వైసిపి పార్టీపై అన్ని వర్గాల ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లు బలుకుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కక్ష సాధింపులకు చోటు లేదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా సైకో మాదిరి వ్యవహరిస్తూ ఇటు ప్రతిపక్ష నేతలను అటు ప్రజలను కూడా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఓటమి భయం జగన్మోహన్‌రెడ్డిలో పట్టుకుందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపి పార్టీకి ఓటమి ఖాయమని హెచ్చరించారు. చంద్రబాబు నాయుడును స్కిల్‌ డెవలప్మెంట్‌ కేసులో అరెస్టు చేసి జగన్మోహన్‌ రెడ్డి శునకానందం పొందుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌ రెడ్డి తప్పుడు కేసులు బనాయించి ఎంతోకాలం సైకో ఆనందం పొందలేరన్నారు. అనంతరం స్కిల్‌ డెవలప్మెంట్‌ సంస్థపై యువతకు అవగాహన కల్పించారు. స్కిల్‌ డెవలప్మెంట్‌ సంస్థ ద్వారా విద్యార్థులకు ప్రయోజనాన్ని కల్పించారని కానీ చంద్రబాబుకు నష్టం చేకూరిందన్నారు. యువత చంద్రబాబు నాయుడు చేసిన మంచిని పదిమందికి తెలియజేసి రానున్న ఎన్నికల్లో టిడిపి అఖండ విజయాన్ని చేకూర్చాలన్నారు. యువతరం వైసిపి పాలనపై పోరాడకపోతే రానున్న రోజుల్లో నష్టం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ తమ్మినేని గీత, పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు బోయిన సునీత, మాజీ కౌన్సిలర్‌ గుడ్ల రాజ్యలక్ష్మి, ఇంజరాపు విశ్వనాథం, కూన అప్పలనాయుడు, నాగళ్ళ మురళీధర్‌, రాడ విజయ్‌ కుమార్‌ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్‌: టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలు అండగా నిలవాలని, వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరశించాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కోరారు. శనివారం నియోజకవర్గం పరిధిలో పోర్టు కళింగపట్నంలో రచ్చబండ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబుతో నేను పేరిట ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. రాష్ట్రంలో కక్షపూరిత పాలన సాగిస్తున్న జగన్‌ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. ఈ కార్యక్రమంలో గార మండల టిడిపి అధ్యక్షులు లోపింటి రాధాకృష్ణ రెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్‌ సెల్‌సభ్యులు దేవదాసు, వైస్‌ ప్రెసిడెంట్‌ లక్ష్మీ, టిడిపి నాయకులు మైలపల్లి ఎర్రన్న, అద్దాల కామేష్‌, మైలపల్లి శారద, రామకృష్ణ, వారధి ఈశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని అల్తి గిరిజన గ్రామంలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి ఆధ్వర్యంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా శనివారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి అరాచకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.మోహనరావు, నెల్లి అచ్చుత రావు, పైల లక్మణరావు, నారాయణరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్‌: రచ్చబండ కార్యక్రమంలో గుండ లక్ష్మీదేవి

కొత్తూరు: గిరిజనులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కలమట

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం బెల్లుపడలో బాబూతో నేను కార్యక్రమం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర బిసి సాధికారిత సమితి కన్వీనర్‌ కొండ శంకర్‌ రెడ్డి అధ్వర్యంలో వార్డ్‌లో పర్యటిస్తూ బాబుతో నేను కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు. చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్‌ చేస్తూ వార్డులో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలో కొఠారి గ్రామ పంచాయతీలో మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సహదేవ్‌ రెడ్డి అధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు.

పొందూరు: పట్టణంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి మండల అధ్యక్షుడు చిగిలపల్లి రామ్మోహన్‌ ఆధ్వర్యంలో శనివారం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, అరాచక విధానాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి-2 అనకాపల్లి వాణి, టిడిపి నాయకులు మద్దిల శ్రీనివాసరావు, కాళ్లకూరి శాంతారామ్‌ పాల్గొన్నారు.

దువ్వాడ మంతనాలతో తమ్ముళ్లు అంతర్మథనం?

టెక్కలి : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గ కేంద్రమైన టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల్లోను, కార్యకర్తల్లోను అలజడి ప్రారంభమైంది. ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్‌ సోదరుడు దువ్వాడ శ్రీకాంత్‌ తెలుగుదేశం పార్టీ నాయకులతో చేస్తున్న మంతనాలు ప్రభావం టెక్కలి తమ్ముళ్లపై పడనుందని వారు మదనపడుతున్నారు. వాస్తవంగా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు దువ్వాడ శ్రీకాంత్‌ సుముఖత వ్యక్తం చేయడం పార్టీకి మంచిదా? కాదా? అన్నది పక్కనబెడితే శ్రీకాంత్‌ చేరిక వలన ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్‌ తెరవెనుక పావులు కదుపుతారనే వాదన టెక్కలి తెలుగు తమ్ముళ్ల మధ్య జోరుగా వినిపిస్తుంది. ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్‌ తన వ్యక్తిగత కుటుంబ పరిస్థితులు కారణంగా గత కొద్ది నెలలుగా టెక్కలిని వీడి పలాసలో తమ్ముళ్ల మధ్యనే ఉంటున్నారు. టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి బాధ్యతలు వీడిన తర్వాత దువ్వాడలో ఆత్మన్యూనతా భావం కలిగి రాజకీయ వైరాగ్యం పొందుతున్న నేపథ్యంలో శ్రీనివాస్‌ సోదరుడు శ్రీకాంత్‌ గడిచిన నెల వినాయకచవితి రోజున కింజరాపు అచ్చెన్నాయుడు స్వగృహంలో సుమారు 4 గంటల సమయం వెచ్చించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకోవడం గమనార్హం. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌ సతీమణి దువ్వాడ వాణి పలాస వెళ్లి దువ్వాడ సోదరులతో వాగ్వివాదానికి తలపడిన తరుణంలో దువ్వాడ సోదరులు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు పన్నుకున్న వ్యూహానికి కర్త ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్‌ అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో టెక్కలి తెలుగు తమ్ముళ్లు అంతర్మథనానికి గురవుతున్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కింజరాపు అచ్చెన్నాయుడుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన దువ్వాడ తర్వాత పరిణామంలో తెలుగుతమ్ముళ్లపై పోలీస్‌ కేసులు నమోదు చేయించడం, రౌడీ షీట్లు తెరిపించడం, తెలుగు తమ్ముళ్లని భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్న తరుణంలో ఇప్పుడు అదే దువ్వాడ సోదరులు కింజరాపు అచ్చెన్నాయుడు, గౌతు శిరీషలతో జరిపిన మంతనాలు, చర్చల నేపథ్యంలో టెక్కలి తమ్ముళ్ల పరిస్థితి అడకత్తెరలోని పోకచెక్కలా మారింది. పలాసలో దువ్వాడ సోదరులను తెలుగుదేశం పార్టీలో చేర్చుకోవడం పలాసలో సమంజసం అయినప్పటికీ ఆ ప్రభావం టెక్కలి తెలుగుదేశం పార్టీ మీద పడుతుందేమో నన్న భయాందోళన మధ్య తెలుగు తమ్ముళ్లు ఉన్నారు. దీనిపై టెక్కలి ఎంఎల్‌ఎ, కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలి తెలుగు తమ్ముళ్లకి ఏ విధంగా భరోసా కల్పిస్తారో వేచి చూడాలి.

విద్యార్థులతో అధ్యాపకులు

'ఐతమ్‌'లో ముగిసిన శిక్షణ

టెక్కలి రూరల్‌ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ మేనేజ్మెంట్‌ ఇంజినీరింగ్‌ కళాశాల సివిల్‌ విభాగం చివరి ఏడాది విద్యార్థులకు ఈనెల 9 నుండి 14 వరకు 'అడ్వాన్స్‌ స్కిల్‌ డెవలప్‌ మెంట్‌ కోర్సు' అనే అంశంపై జరిగిన శిక్షణా తరగతులు ముగిశాయని కళాశాల డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వి.వి.నాగేశ్వరరావు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతుల వలన విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఇటువంటి మరిన్ని అవగాహనా సదస్సులు నిర్వహించాలని అధ్యాపక బృందానికి సూచించారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎ.ఎస్‌.శ్రీనివాసరావు, హెచ్‌ఒడి డాక్టర్‌ పి.దినకర్‌, అసిస్టెంట్‌ హెచ్‌డి జి.డి.ఆర్‌.నాయుడు, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సదస్సులను పర్యవేక్షించారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

పోలాకి : నరసన్నపేట మిలీనియం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ముగ్గురు విజేతలకు శనివారం బహుమతులు ప్రధానం జరిగింది. ప్రపంచ శాంతి కాంక్షిస్తూ డ్రీం అండ్‌ డేర్‌ అనే అంశంపై ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో వంగ తెజేశ్వరికి(టెన్త్‌) ప్రథమ, పొట్నూరు దివ్యదాత్రికి(9వ తగరగతి), ద్వితీయ బహుమతి, పరస భవానికి (టెన్త్‌), తృతీయ బహుమతులు లభించాయి. వీటిలో ప్రథమ బహుమతి పొందిన చిత్రం జోన్‌, రీజియన్‌లకు పంపిస్తామని లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షులు సదాశివుని కృష్ణ తెలిపారు. లయన్స్‌ ప్రధాన కార్యదర్శి వి.నాగరాజు, కోశాధికారి పొట్నూరు రమేష్‌, జోన్‌ చైర్మన్‌ ఊన్న రంగనాథ్‌, లయన్స్‌ సీనియర్‌ మెంబర్‌ వివిఎస్‌ఎన్‌ మూర్తి, కె.సాయిరాం, సాయి శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.

కొవ్వొత్తులు వెలిగిస్తే నీతిమంతులై పోతారా?

టిడిపి నిరసనలపై మంత్రి ధర్మాన విమర్శ

మాట్లాడుతున్న మంత్రి ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్‌ : కొవ్వొత్తులు వెలిగిస్తే, దివిటీలు పట్టుకుంటే చేసిన పాపాలు కరిగి పోతాయా? నీతిమంతులైపోతారా? టిడిపి నిరసనలపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఎద్దేవా చేశారు. గార మండలం కొత్తూరు సైరిగాంలో శనివారం జరిగిన గడపగడపకూ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. చట్టం ముందు అందరూ సమానమేనని, చంద్రబాబు ప్రజాధనం దుర్వినియోగం చేశారని, సిఐడి కేసు పెట్టిందని, ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎన్ఫోర్స్మెంట్‌ డైరెక్టరేట్‌, ఆదాయపన్ను శాఖ విచారణల్లోనూ తేలిందన్నారు. స్కిల్‌ డెవలప్మెంట్‌ కార్పొరేషన్‌తో తాము ఒప్పందం కుదుర్చుకోలేదని సీమెన్స్‌ సంస్థ స్పష్టం చేసిందన్నారు. ఆ సంస్థ పేరుతో షెల్‌ కంపెనీలకు, అక్కడి నుంచి చంద్రబాబు బినామీల అకౌంట్లకు ప్రభుత్వ నిధులు చేరినందునే కేసులు పెట్టి జైల్లో పెట్టారని, ఆయన దోసా, నిర్దోషా తేల్చాల్సింది న్యాయస్థానాలని ధర్మాన చెప్పారు. కార్యక్రమంలో యువనేత ధర్మాన రామ్‌ మనోహర్‌ నాయుడు, డిసిఎంఎస్‌ చైర్మన్‌ గొండు కృష్ణమూర్తి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఎంపిపి గొండు రఘురాం, మండల వైసిపి అధ్యక్షుడు పీస గోపి, నాటక అకాడమీ డైరెక్టర్‌ ముండేటి కృష్ణ, వైస్‌ ఎంపిపి అరవల రామకృష్ణ, సర్పంచ్‌లు మార్పు ఆదినారాయణ, మార్పు పృథ్వి, పీస శ్రీహరి, పార్టీ నేతలు అరంగి మణి, యాళ్ల నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా

పిసిసి సహాయ కార్యదర్శి కృష్ణారావు

మాట్లాడుతున్న అంబటి కృష్ణారావు

శ్రీకాకుళం అర్బన్‌ : కేంద్రంలో తిరిగి కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తే తప్ప విభజన చట్టంలోని హామీలు నెరవేరవని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపికి 22 మంది ఎంపిలున్నా బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించే సాహసం చేయలేక వారివద్ద మోకరిల్లుతున్నారని పిసిసి సహాయ కార్యదర్శి అంబటి కృష్ణారావు విమర్శించారు. శనివారం నగరంలోని ఇందిరా విజ్ఞాన్‌భవన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీకి పూర్వ వైభవం రావడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. విభజన తర్వాత కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి ఇవ్వాల్సిన విభజన హామీలేవీ నెరవేర్చలేదన్నారు. కార్పొరేట్‌ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మి ప్రజలను ఆస్తులను అప్పనంగా కట్టబెట్టే పనిలో బిజెపి పెద్దలు నిమగ్నమై ఉన్నారన్నారు. కక్షసాధింపు, మత చాందసవాదం, కులాల, మతవిద్వేసాలు రెచ్చ గొట్టడంతో పబ్బం గడుపుతున్నారన్నారు. భారత్‌ జోడో యాత్రలో ఎపికి ప్రత్యేక హోదా కల్పిస్తామని రాహుల్‌ గాంధీ హామీ ఇచ్చారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు దేశళ్ల మల్లిబాబు, రెల్ల సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా చెట్లు నరికివేత

పట్టించుకోని ఆర్‌అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి- లావేరు
ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో రహదారికి ఇరువైపుల మొక్కలు నాటడానికి, వాటిని సంరక్షణ చేసేందుకు లక్షల్లో ఖర్చుచేసి అవి పెరిగి చెట్టుగా రహదారికి ఇరువైపుల అల్లుకుని రహదారి గుండా ప్రయాణిస్తున్న ప్రజలకు ఎండ నుంచి సేదదీరేందుకు ఉపయోగ పడుతున్న పెద్దపెద్ద చెట్లను కొంతమంది స్వార్థపరులు భూములు కలుపుకునేందు చట్టవ్యతిరేకమైన ఆ చెట్లను విచక్షణ రహితంగా పట్టపగలు నరికేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ చెట్లు విలపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తె రణస్థలం నుంచి రాజాం వెళ్లే రహదారి ఇరువైపులా గతంలో మొక్కలు నాటి అవి పెద్ద చెట్లుగా ఉండి అందంగా నీడనిస్తూ పర్యవరన పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతున్న చెట్లను రణస్థలం మండలం గొల్లపేట నుండి సీతంవలస వరకు రహదారికి ఇరువైపుల ఉన్న రహదారిని కలుపుకుని జెసిబిలతో తవ్వుతూ చెట్లను నరికేస్తున్నారు. ఇంత జరుగుతున్న సంబంధత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో రహదారి గుండా ప్రయాణిస్తున్న వారు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఏ ఆశయంతో మొక్కలు నాటించిందో, లక్షలు ఖర్చు పెట్టి పెంచిందో ఆ లక్ష్యం నేడు నిర్వీర్యమైపోతుందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు పట్టించుకుని చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత రహదారులు, భవనాలు శాఖ ఎఇ ఆర్‌.విక్రమ్‌ వద్ద ప్రస్తావించగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి చెట్లను నరికివేసిన వారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రణస్థలం నుంచి రాజాం వెళ్లే రహదారిలో నరికివేసిన చెట్లు

రైతు నేస్తం పురస్కారం ప్రదానం

ఆమదాలవలస : జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా బూర్జ మండలం రామన్నపేట గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు వరలక్ష్మికి ఉత్తమ మహిళా రైతు, రైతు నేస్తం పురస్కారాన్ని ప్రదానం చేశారు. శనివారం విజయవాడలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఉత్తమ మహిళా రైతు రైతు నేస్తం పురస్కారాన్ని వరలక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి మాట్లాడుతూ ఈ పురస్కారం రావడం చాలా ఆనందంగా ఉందని, ఈ అవార్డు తమపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విశేషమైన కృషి చేశారని వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారికి ప్రకృతి వ్యవసాయ విభాగం తరఫున అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఈ పురస్కార గ్రహీత వరలక్ష్మి రామన్నపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సహజ వనరుల కేంద్రంను బాగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఇటువంటి అవార్డుల వలన ప్రకృతి వ్యవసాయం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు వద్ద చేరువ చేయడానికి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నమడు, జగన్‌ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాధవరావు

ఈ-క్రాప్‌ నమోదు గడువు పెంచాలి

ప్రజాశక్తి- పలాస
ఈ-క్రాప్‌ పంటల నమోదుకు అక్టోబరు 30 వరకు గడువు పెంచాలని సిపిఐఎంఎల్‌ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు ప్రభుత్వానికి కోరారు. మండలంలోని సూదికొండ కాలనీలో ఉన్న న్యూ డెమోక్రసీ పార్టీ ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్‌ జుత్తు వీరాస్వామి, ఐఎఫ్టియు నాయకులు షణ్ముఖరావుతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. తక్కువ వర్షపాతం నమోదైందని, కరువు ఛాయలు తాండవిస్తున్నాయని, పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌పుట్‌ సబ్సిడీని తక్షణమే అందించాలని డిమాండ్‌ చేశారు. ఈ క్రాప్‌ పంటలు నమోదుకు గడువు పెంచ్చఆలన్నారు. ఆధార్‌ లింకు లేని వాళ్లకీ లింక్‌ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

సన్మానిస్తున్న స్నేహితులు

విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి సన్మానం

ఇచ్ఛాపురం: స్థానిక గొల్లవీధికి చెందిన దక్కత నరసింహమూర్తి (సుమన్‌) 30 ఏళ్ల పాటు ఇండియన్‌ ఆర్మీలో వివిధ కేడర్లలో విధులు నిర్వహించి హానరరీ కెప్టెన్‌గా ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు స్థానిక సురంగి రాజావారి మైదానంలో మిత్రులు, క్రీడాకారులు, వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, ప్రజలు శనివారం ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. జనసేన పార్టీ అధ్యక్షులు దాసరి రాజు, మిత్రులు ఉమా శంకర్‌ ఇతరులు సుమన్‌ ఆర్మీ చేసిన సేవలను కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని యువతను ప్రోత్సహించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ యువత మంచి లక్ష్యంతో ఏదైనా రంగంలో రాణించడానికి కృషి చేయాలన్నారు. కుటుంబాన్ని, దేశాన్ని రెండు కళ్లగా భావించి సేవ చేయాలన్నారు. సమావేశంలో దక్కత గోపీనాథ్‌రెడ్డి, తిప్పన లక్ష్మణరెడ్డి, యోగి, ఎల్‌ఐసి బుజ్జి, మురళీధర్‌, వెంకటరమణ, శంకర్‌, వెంకటరమణ పాల్గొన్నారు.

సిఎస్‌పి రహదారి పూర్తయ్యేనా..?

జనసేన నాయకుడు రామ్మోహనరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రామ్మోహనరావు

నియోజకవర్గ పరిధిలో శ్రీకాకుళం నుండి ఆముదాల వలస ప్రధాన సిఎస్‌పి రహదారి దుస్థితి నేటికీ పూర్తి కాకపోవడం వైసిపి పార్టీ పనితీరుకు అద్దం పడుతుందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్‌రావు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. గత టిడిపి ప్రభుత్వంలో నిధులు మంజూరు అయినప్పటికీ నేటికీ రహదారి పనులు పూర్తి కాకపోవడం వైసిపి ప్రభుత్వం చేతకాని పరిపాలనకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. స్థానికంగా శాసనసభాపతి తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన ప్రసాదరావు ఉన్నప్పటికీ కూడా ప్రజల గోడును పట్టించుకునే నాథుడే లేరని వాపో యారు. అలాగే దేశంలోనే అత్యధికంగా పెట్రోల్‌ ధరలు మన రాష్ట్రంలోనే అధికమని, రోడ్ల చెస్‌ పేరుతో డబ్బులు వసూలు చేస్తూ రోడ్ల అభివృద్ధిని మాత్రం గాలికి వదిలేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం కళ్లు తెరిచి ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులపై శ్రద్ధ తగ్గించి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు.

'పేడాడ' నియామకంపై హర్షం

పలాస : జిల్లా కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షులుగా డాక్టర్‌ పేడాడ పరమేశ్వరరావు నియామకం పట్ల పలాస నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌ఛార్జి శాంతారావు, శ్యామసుందర రావులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉద్యమ నేతగా పేరొందిన పరమేశ్వర రావు కాంగ్రెస్‌ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్టీ నిర్మాణానికి అందరిని కలుపుకుంటూ పూర్వవైభవం తెచ్చేందుకు తమ సహకారాలు అందజేస్తామన్నారు.

కిసాన్‌ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా గోవిందరావు

గోవిందరావు

కొత్తూరు : బిజెపి కిషన్‌ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా చోడవరపు గోవిందరావుని నియమించినట్లు కిసాన్‌ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కిసాన్‌ మోర్చా విభాగంలో నాలుగేళ్లుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. గోవిందరావు సేవలను పార్టీ గుర్తించి బాధ్యతలను అప్పగించారు. రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి, కుమార్‌ స్వామికి, మధు ఖర్జీ బిర్లాంగి ఉమా మహేశ్వరావు, ఎస్‌.రాఘవులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

కొత్తూరు : దసరా సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి టి.ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. చదివేందుకు కథలు, పద్యాలు, జనరల్‌ నాలెడ్జి వంటి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయం రెండు పూటలా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

అన్నసంతర్పణ

ప్రజాశక్తి- ఆమదాలవలస
పట్టణంలో రామ మందిరం ఎదురుగా శ్యామ్‌ స్టూడియోస్‌ దగ్గర భారీ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా వినాయక చవితి ఉత్సవాల అనంతరం మాజీ కౌన్సిలర్‌ దుంపల శ్యామలరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం ఆనవాయితీగా వస్తున్నది. పట్టణ నలుమూలల నుండి ప్రజలు భారీ ఎత్తున సుమారు 3వేల మంది వరకు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ మాజీ ఫ్లోర్‌ లీడర్‌ బొడ్డేపల్లి రమేష్‌ కుమార్‌, పేడాడ చిన్నారావు, గుడ్ల బాబు, బొడ్డేపల్లి రవి, మెట్ట నాగు, టింకు, బోయిన బాల పాల్గొన్నారు.